## డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



జాతీయ లోక్ అదాలత్ మీటింగ్‌లో న్యాయమూర్తి

ఖమ్మం లీగల్, అక్టోబర్ 12: డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యండీ అబ్దుల్ జావేద్ పాషా పేర్కొన్నారు. గురువారం న్యాయమూర్తి కోర్టు ప్రాంగణంలోని కోర్టు డ్యూటీ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులతో పాటు, చట్టం అనుమతించిన ఇతర కేసులను కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరించవచ్చని అన్నారు. ఇప్పటి నుంచే రాజీ ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో లైజన్ అధికారులు భద్రునాయక్, మోహన్‌రావు, సోమయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పకడ్బందీగా కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

### పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్



సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న సీపీ విష్ణు ఎస్ వారియర్

మామిళ్లగూడెం, అక్టోబర్ 12: కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థులకు బుధవారం నుంచి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సర్టిఫికెట్ల పరిశీలనను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. అభ్యర్థులు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు సూచించిన విధంగా తమ సర్టిఫికెట్లను తీసుకొనిరావాలని సూచించారు. 12న సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ అభ్యర్థులు 191 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగిందన్నారు. 13న టీఎస్ఎస్‌పీ, ఫైర్ సర్వీస్, ఎక్సైజ్, ఐటీసీ, ట్రాన్స్‌పోర్టు, వార్డర్, తదితర విభాగాల్లో ఎంపికైన 265మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. సీసీఆర్‌బీ ఏసీపీ ప్రసన్నకుమార్, ఏవో అక్తరూన్నీసాబేగం, సెక్షన్ సూపరింటెండెంట్ జానకీరామ్ పాల్గొన్నారు.

## మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ

ఖమ్మం, అక్టోబర్ 12: రాష్ట్ర రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ మృతికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మంత్రి ప్రశాంతరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దైవాన్ని ప్రార్థించారు.

## వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పల్లా కిరణ్‌కుమార్

ఖమ్మం సిటీ, అక్టోబర్ 12: ఖమ్మం నగరానికి చెందిన దివంగత పల్లా జాన్ రాములు వర్ధంతి సందర్భంగా గురువారం మిషన్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన కుమారుడు పల్లా కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఖమ్మానికి చెందిన నిపుణులైన వైద్యులచేత వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయ సాధనలో భాగంగానే విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు రోజులపాటు శిబిరం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ రఘు, చందన, సాయి సంపత్ కృష్ణ, మిషన్ ఆసుపత్రి మేనేజర్ కృష్ణకుమారి, ప్రముఖులు చిలకబత్తిని కనకయ్య, స్పందన, లక్ష్మి, సుజాత, అబ్రహం, సత్యనారాయణ, గిరి, జగన్, సురేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు పత్రాలతో ప్లాటు విక్రయంపై కేసు నమోదు

రఘునాథపాలెం, అక్టోబర్ 12: తప్పుడు పత్రాలతో ప్లాటు విక్రయించిన వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై బీ కొండలరావ్ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలేనికి చెందిన తేనె నాగేశ్వరరావు, బాసిత్‌నగర్ బంజరకు చెందిన బోడా రమేశ్, బోడా పద్మ వద్ద 2020 అక్టోబర్‌లో రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలో 523 గజాల ప్లాటు కొనుగోలు చేసి రూ.10లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. మిగిలిన పైకం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయమని కోరగా రమేశ్, పద్మ కాలయాపన చేస్తున్నారు. దీనిపై నాగేశ్వరరావు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ప్లాటుపై విచారణ చేపట్టగా సదరు ప్లాటు వేరే వ్యక్తులకు చెందినదిగా తెలుసుకున్నాడు. తనకు విక్రయించిన బోడా రమేశ్, బోడా పద్మ అసలు పేర్లు బానోతు బాష, బానోత్ సుమతిగా తెలుసుకొని పోలీసులను ఆశ్రయించాడు. బానోతు సుమతి, బానోత్ భాషపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### కలెక్టర్ వీపీ గౌతమ్



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం అక్టోబర్ 12: పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ఓటరు జాబితాను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం నూతన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రిటిర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దారులు, ఎంపీడీవోలతో పెండింగ్ దరఖాస్తులు, మద్యం, బెల్ట్ షాపులు, కొత్తగా వివాహమై అత్తగారి ఇంటికి వచ్చిన కోడళ్ల ఓటు వివరాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంత మంది ఓటర్లు షిఫ్ట్ అయింది, డూప్లికేట్ ఓటర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నివేదిక ప్రకారం పోలింగ్ కేంద్ర పరిధిలో ఎంత మంది కొత్త కోడళ్లు వచ్చింది, వారి ఓటు, వారి తల్లిగారి గ్రామంలో ఉందా, లేదా కొత్తగా వచ్చిన అత్తగారి గ్రామానికి మారిందా చూడాలన్నారు. షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం అందించే వైన్ షాపులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని, ప్రచార సంబంధ హోర్డింగులు, పోస్టర్లు, గోడ రాతలు తొలగించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అప్పారావు, మాస్టర్ ట్రైనర్ కె.శ్రీరామ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్‌గోపాల్, సత్యనారాయణ, మీనన్, రాంబాబు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

అసెంబ్లీ ఎన్నికలకు నిర్వహణకు నియమితులైన నోడల్ అధికారులకు ఎలక్షన్ అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని ఖమ్మం కలెక్టర్ వి.పి.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి అవకతవకలకు తావు ఉండొద్దన్నారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పక్కాగా పాటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయాలన్నారు. ఎనిబ్నకల సిబ్బందితో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీ విజిల్ యాప్‌పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నవంబర్ 15 నుంచి ఓటర్ స్లిప్‌ల పంపిణీని ప్రారంభించాలన్నారు. సీనియర్ సిటిజెన్స్ ఓటు వేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ పాల్గొన్నారు.

# నేటి నుంచి దసరా సెలవులు

### 13 రోజుల సెలవులు ప్రకటించిన విద్యాశాఖ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 12: బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు అధికారులు సెలవులు ప్రకటించారు. పాఠశాల విద్యార్థులకు ఈ నెల 13 నుంచి ఈ నెల 25 వరకు 13 రోజులు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంటర్ విద్యాసంస్థలకు ఈ నెల 19 నుంచి 25 వరకు సెలవులు ఇచ్చారు. పాఠశాల విద్య, ఇంటర్ విద్యతోపాటు డిప్లొమా, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ వంటి సాంకేతిక కళాశాలలకు దసరా సెలవులను ప్రకటించారు. స్టేట్ బోర్డు ఆఫ్ పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న డిప్లొమా కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలకు ఈ నెల 22 నుంచి 28 వరకు సెలవులు ప్రకటించాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. ఈ సెలవులను విద్యార్థులతో పాటు యథావిధిగా ఉపాధ్యాయ వర్గానికి అమలు చేయాలని సూచించారు.

### నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా స్థాయిలో పాఠశాలలను సెలవుల్లో నిర్వహిస్తే అనుమతులు శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఇంటర్ తరగతులు నిర్వహిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు సూచించారు.

### హాస్టళ్ల నుంచి విద్యార్థులు ఇళ్లకు

13 రోజుల సెలవులు రావడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి తల్లిదండ్రులతో కలిసి గురువారమే ఇళ్లకు పయనమయ్యారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారి సొంత ప్రాంతాలకు తరలివెళ్లారు.

# విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబురాలు



ఖమ్మం పబ్లిక్ స్కూల్‌లో...

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 12: బతుకమ్మ వేడుకలను గురువారం నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పట్టు వస్త్రాలు ధరించి తంగేడు, బంతి, చేమంతి పూలతో బతుకమ్మలను తయారుచేసి గౌరమ్మలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ వేడుకను నిర్వహించారు.

నిర్మల్ హృదయ్‌లో.. బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడి సంబురాలు చేశారు.

త్రివేణి స్కూల్‌లో.. రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆటలు ఆడారు.

ఖమ్మం పబ్లిక్ పాఠశాలలో.. నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. బతుకమ్మ విశిష్టతను విద్యార్థినులకు వివరించారు.

**రెజోనెన్స్ శ్రీనగర్‌లో..**

నగరంలోని రెజోనెన్స్ శ్రీనగర్ పాఠశాలలో గురువారం బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు నగర మేయర్ పునుకోల్లు నీరజ ముఖ్యఅతిథిగా హాజరై ఆడిపాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా జరగని అద్భుతమైన పూల పండుగ బతుకమ్మ అని, ప్రజలందరూ వారి బతుకులో భాగంగా కుటుంబమంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ నిర్వహించుకుంటారన్నారు.

### ఎమ్మెల్సీ తాతా మధుపై దుష్ప్రచారం తగదు

కూసుమంచి రూరల్, అక్టోబర్ 12: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుపై కాంగ్రెస్ పార్టీ వారు దుష్ప్రచారం చేయడం తగదని బీఆర్ఎస్ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు చాట్ల పరుశురామ్, నాయకుడు రాయబరపు రమేశ్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చౌకబారు ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధిచెప్తారని వారు హెచ్చరించారు.

# మా ఓట్లన్నీ బీఆర్ఎస్‌కే..



ఇంటి ముందు ఫ్లెక్సీ కడుతున్న అనిల్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 12: మా ఇంటిలో ఉన్న 13 ఓట్లు బీఆర్ఎస్ పార్టీకే వేస్తామని, దయచేసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు మా ఇంటికి వచ్చి ఓటు అడగవద్దని ఖమ్మం నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన మాతంగి అనిల్‌కుమార్ ఇంటి ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ఖమ్మం నగరంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో మంత్రి అజయ్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులను అనుభవిస్తున్న ఎవరైనా సరే కారు గుర్తుకు ఓటు వేస్తారని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా 2014 ముందు ఖమ్మంలోని త్రీటౌన్ ప్రాంతం ఎలా ఉంది.? ఇప్పుడు ఎలా ఉందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. నాలుగు దశాబ్ధాలుగా ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగామని, అజయ్‌కుమార్ చేసిన అభివృద్ధిని ఎవరూ చేయలేదన్నారు. 29 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు యర్రా అప్పారావు, డివిజన్ ఉపాధ్యక్షుడు సైదులు తదితరులు పాల్గొన్నారు.